

అతిథి

కాశీనాథ ఉ కాశీనాథ

మహారాజశ్రీ రఘురామయ్యగారికి,

వరంధామయ్య వ్రాయునది.

మీరు మా సమాధానం కోసం ఎదురుచూస్తూ వుంటారని నాకు తెలుసు. అయితే మీరు చేసిన మోసం గ్రహించామని మాత్రం మీకు తెలియదు. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యాలన్న సామెతను మీరు అక్షరాలా ఆచరణలో పెడతారని ఊహించలేదు.

మోసానికి కూడ పరిమితు లుంటాయి. ఆడపెళ్ళివార మైనంత మాత్రాన మీ అడుగులకు మడుగు లొత్తి, మీరు మా సంబంధానికి అంగీకరించడమే మహాద్భాగ్యంగా భావిస్తామని మీరను కుంటే అది అన్న పొరపాటే అవుతుంది.

ఆడపిల్ల పెళ్ళి చెయడం కష్టమే. అందులోనూ మంచి సంబంధం చేయడం యింకా కష్టం. అందుకోసం ఆ తండ్రి ఎన్ని అగచాట్లైనా పడతాడు. కాని ప్రాణం యిచ్చుకోడు. మీ అబ్బాయి వివాహం అయిన సంవత్సరంలోగా పిల్ల నిచ్చిన వ్యక్తికి మరణయోగం వుందన్న విషయాన్ని మాసుంచి దాచినా లోకం నుంచి దాచలేకపోయారు. కొన్ని సందర్భాలలో నిజం నిలకడ మీద కాకుండా త్వరలోనే తెలుస్తుందని గుర్తించండి.

మీరు చేసిన మోసాన్ని సమర్థించుకో నక్కరలేదు. మా సంబంధం గురించి ఆలోచించ వద్దు. నా ప్రాణాన్ని పణంగా కోరని మరో సంబంధం మా కూతురికి చూసుకుంటాము. మీ సంబంధం మాకు వద్దు. సెలవు.

ఇట్లు,

పరంధామయ్య.

ఉత్తరం పూర్తి చేసి కవరులో పెట్టి అయిదింటి పోస్టులో పోస్టుచేసి వచ్చిన పరంధామయ్య మనస్సు సంతృప్తిగా వుంది. ఎంతో గొప్ప ఆపదలో నుంచి తప్పుకున్న ఆనందం ఆయన ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఒళ్ళంతా బరువుగా అనిపించి కుర్చీలో కూర్చుండి పోయాడు పరంధామయ్య. ఆడపిల్ల పెళ్ళి కుదిర్చిన ఏ తండ్రి అయినా యెంత సంతోషంగా వుంటాడో అంతకంటే సంతోషంగా వున్నాడు ఆయన నిన్నటివాకా. కలిగిన సంబంధం. పిల్లవాడు బాగా చదువుకున్నవాడు. అందమైనవాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. ఈ సంబంధాన్ని గురించి తను ఎంతో సంబరపడ్డాడు. ఈ సంబంధం కుదిరిందని మగ పెళ్ళివారు ఒప్పుకొన్నారని తెలిసిన రోజున తను ఈ ప్రపంచాన్ని జయించినంత సంబర పడ్డాడు. తను కలిగినవాడు కాకపోవడంవల్ల, పిల్ల అందచందాలను చూసి పెళ్ళివారు ఏ బెట్టు చెయ్యకుండానే పదిమెట్లు దిగి రావటం, తనకు మొదట్లో ఆశ్చర్యం కలిగించినా, ఆనందం దాన్ని వెంటనే కప్పేసింది.

తను మొదట్లో కూతురి పెళ్ళి చెయ్యలేకపోతానేమోనని భయపడ్డాడు. కారణం కట్నం యిచ్చుకోవడంలో అందరికీ వుండేబాధ, అశక్తత తనకు

సాదించి పెద్దపెళ్ళిగా వుండటము. తను ఎంత మీద పడ్డైనా, అన్ని విధాల మంచి సంబంధం కావాలను కోవడం పరంధామయ్యకి దురాశగా తోచలేదు.

ప్రపంచంలో తను పుట్టిపెరిగిన తర్వాత తనకి కలిగిన ఒకేఒక అదృష్టం ఈ సంబంధం అని పరంధామయ్య మొదట అనుకొన్నాడు. అయితే అసలు అదృష్టం యిది కాదని, అదృష్టం అంతా యీ సంబంధం కుదరటంలోకాక తప్పిపోవడంలోనే వుందని తనకి తెలిసిన రోజున భయపడ్డాడు.

తనకి ఆ విషయం కొంచెం ఆలస్యంగా తెలిసి వుంటే? జోగయ్య తనకి దైవికంగా తటస్థపడకుండా వుండి వుంటే? జరిగె పెళ్ళిని చెడగొట్టకూడదని, ఆ విషయం జోగయ్య తనకి చెప్పకుండా వుండి వుంటే? ఏం జరిగి వుండేది? ఊహించడానికే భయం వేస్తోంది. సుశీల వివాహ వేదికలోకి ప్రవేశించిన క్షణం తను బలిపీఠం మీద అడుగు పెట్టిన క్షణం అయ్యేది. ఆమె మెడలో మంగళ సూత్రాలు పడిన క్షణం, తన మెడలో వురితాడు బిగించుకున్న క్షణం అయ్యేది. ఆపత్సమయాలలో భగవంతుడు అవతారమెత్తుతాడన్న తన నమ్మకం ఎలాంటిదైనా, యీ సంబంధాన్ని గురించిన లోపాలు చెప్పి పెళ్ళి తప్పించిన జోగయ్యలో భగవంతుడిని చూశాడు ఆయన.

జోగయ్య తనకి ఆప్త మిత్రుడు కాకపోయినా, కనీస పరిచయం గలవ్యక్తి. అయితే ఈ సంఘటనతో పరిచయం స్నేహంగా మారి గట్టిపడింది.

* * *

పరంధామయ్య కుర్చీలో అలా చాలాసేపు కూర్చుండిపోయాడు. ఒక ఐదు నిమిషాలపాటు నిద్ర పట్టింది. లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. దాహం వేసింది. నీళ్ళు తెమ్మని భార్యని పిలవబోయాడు గాని, ఆమె యింట్లో లేదని గుర్తుకు వచ్చింది. రాబోయే పెళ్ళికోసం చీరలు తెచ్చుకోవడానికి వెళ్ళింది. పెళ్ళి రద్దు అయిందని తెలియదు పాపం. రాగానే చెప్పాలి. చెపితే నిరాశ, ఆనందం రెండూ కలుగుతాయి. నిజమే పెళ్ళి తప్పిపోయినందుకు బాధ పడాలా, ప్రమాదం తప్పినందుకు సంతోషించాలా? చీకటి పడుతోంది. గదిలో దీపం వెలిగించాడు.

గదిలో పెట్టె సగం సర్దివుంది. సాయంత్రం ప్రయాణం పెట్టుకున్నాడు తిరుపతికి. ఈ పెళ్ళి కుదిరితే ఆ దేవుణ్ణి దర్శిద్దామనుకొన్నాడు. అదే యీ ప్రయాణం ఇప్పుడు..... ఇప్పుడు ఈ పెళ్ళి తప్పించినందుకు దర్శించాలి.

మంచినీళ్ళు తనే పోసుకుని తాగాడు. తాగుతుంటే తలుపు చప్పుడు వినిపించింది.

లక్ష్మమ్మ చాల సంబరంగా వచ్చింది. మూడు చీరలున్న పేకెట్ చేతిలో వుంది. చీరలు వుత్సాహంగా చూపించింది భర్తకి. పరంధామయ్య ముభావంగానే చూశాడు వాటిని.

'ఏమిటలా ఉన్నారు?' అంది.

'చెబుతాను. అమ్మాయి ఎక్కడుంది?'

'వాళ్ళ స్నేహితురాలింటికి వెళ్ళింది'

ఒక క్షణం ఆగి 'మనం చాల మోసపోయాము' అన్నాడు.

'ఏమిటి?' అంది ఆదుర్దాగా.

'ఏముంది. నేను ఆహుతి అయిపోయి వుండేవాడిని. పెళ్ళికొడుకు పెళ్ళి అయిన సంవత్సరములో పిల్ల నిచ్చిన వ్యక్తి చచ్చిపోతాడట.'

'ఏలా తెలిసింది? ఎవరు చెప్పారు?' అంది లక్ష్మమ్మ నీరసంగా.

'ఎవరు చెపితేనేం?' జరిగిందిదీ.

'మరయితే వాళ్ళు ఇవాళ ఉత్తరం రాయమన్నారుగా లగ్నం నిశ్చయించి.'

'ఉత్తరం రాశాను. లగ్నం నిశ్చయించి కాదు, ఈ పెళ్ళి అక్కరలేదని.'

ఇద్దరూ ఏమీ మాట్లాడలేక పోయారు చాలా సేపు. పరంధామయ్య చుట్ట తీసి వెలిగించాడు. 'చూశావా! ఎంతటి ప్రమాదం జరిగి ఉండేది! ఆ జోగయ్య నిజం చెప్పకపోతే ఏమి జరిగిఉండేదో.'

లక్ష్మమ్మ చటుక్కున భర్తవైపు తిరిగింది. 'ఎవరూ, జోగయ్యా మీకు చెప్పింది?'

'అవునూ, జోగయ్యే. నీకు తెలుసా?'

'శివాలయం వీధిలో వుంటాడు. ఆయనేనా?'

'ఆయనే, ఏం?'

'అయితే అబద్ధం, ఆయన చెప్పిన దంతా అబద్ధం. ఆయన అలాంటి మనిషి. ఇలాగే శివరామయ్య గారికీ చెప్పాడట. వాళ్ళు మానుకున్న సంబంధమే తన కూతురికి చేసుకొన్నాడు. ఆయనకి అంతా ఆడపిల్లలే.'

పరంధామయ్య కంగారుగా లేచాడు.

'నిజమేనా నీవు చెప్పింది? ఎలా తెలుసు నీకు?'

'శివరామయ్య గారిభార్య చెప్పింది. ఇప్పుడే పెళ్ళి కనుక్కోండి.'

కండువా భుజంమీద వేసుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు ఆయన. గంటలో తిరిగి వచ్చాడు మొహంలో అలసట, నీరసం, పశ్చాత్తాపం.

నిజం లక్ష్మీ, జోగయ్య ఒక స్కౌండ్రల్. వాడు చెప్పినదంతా అబద్ధం. వాడిని గురించి చాల కనుక్కొన్నాను. చాల నీచపు మనిషి. జాతకాలు చూడ్డం లాటివేమీ తెలియవు.

కుర్చీలో కూలబడి పోయాడు ఆయన. ఛ, ఇప్పుడేం చేయాలి. ఉత్తరం పోస్టు చేసేశాము, అన్నాడు నిస్పృహగా.

'ఏం రాశారు?'

'చాలా రాశాను. ఈ జన్మలో మా సంబంధం సంగతి ఆలోచించవద్దని రాశాను. మోసానికి కూడ పరిమితులుంటాయనీ, యింత మోసం చేస్తే సహించమనీ రాశాను. అబద్ధాలు చెప్పి పెళ్ళిళ్ళు చేయవద్దని రాశాను.'

'. . . .అంత తొందర పడకుండా ఉండాల్సింది అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు.'

రఘురామయ్యగారు మాట పట్టింపు మనిషి. మాట అంటే ఖచ్చితంగా చేస్తాడు. మేనరికం చేసుకోమని ఆయన చెల్లెలు పోరుపెడుతుంటే కాదని పట్టుబట్టి మన సంబంధం ఒప్పుకున్నాడు. ఆయన మనస్సు ఒక విధంగా మారితే మళ్ళీ దాన్ని మార్చలేము. ఒకసారి మనస్సు గాయపడితే దాన్ని సరిచెయ్యలేము. ఈ ఉత్తరం చదివితే ఆయన మనస్సు విరిగి పోతుంది. మనం ఇంక ఎంత చెప్పినా లాభం వుండదు. అయినా ఏ ముఖంపెట్టుకుని ప్రార్థించగలం? అన్నాడు పరంధామయ్య.

బంగారంలాంటి సంబంధం చిన్న పొరపాటు వల్ల చెయిజారి పోయింది. కూతురి భవిష్యత్ తన అవివేకంతో పాడు చేశాడు.

లక్ష్మమ్మ బాధగా చూసింది, 'కుదరక కుదరక మంచి సంబంధం కుదిరితే, అది కాస్తా ఇలా గంగపాలయింది. ఆ వుత్తరం చూశాక వాళ్ళు మనం ఇంక ఎంత చెప్పినా వినరు. మన సంబంధం యింక చచ్చినా ఒప్పుకోరు' అంది.

పరంధామయ్య గొణుక్కున్నాడు.

ఆ వుత్తరం చూశాక మన సంబంధం చచ్చినా ఒప్పుకోరు అవును. . . . . .ఆ వుత్తరం చూశాక.

పరంధామయ్య చటుక్కున లేచి కూర్చున్నాడు. ఏదో చిన్న ఆశ మొహంలో కన్పించింది.

'లక్ష్మీ నా బట్టలు సర్దు' అన్నాడు వుత్సాహంగా.

'ఏమిటి?' అంది భర్త మొహంలోకి విచిత్రంగా ఆశగా చూస్తూ.

'ఏలూరు వెళుతున్నాను'

'ఎప్పుడు?'

'ఇప్పుడే'

'ఎందుకు?'

మనం ఆ సంబంధం ఇంకా పోగొట్టుకోలేదు. పరిస్థితి మన చేతిలోంచి యింకా జారిపోలేదు. మన అదృష్టం బాగుంటే వుత్తరం వాళ్ళు చూడరు.

లక్ష్మమ్మకి అర్థం అయింది. చకచక బట్టలు సర్దింది వుత్సాహంగా. పరిస్థితి అంతా మళ్ళీ పూర్తిగా బాగుపడే అవకాశం వుంది. ఇప్పుడు జరిగిన దేమీ జరక్కపోతే వుండే పరిస్థితి యిప్పుడూ వచ్చే అవకాశం వుంది. తన భర్త బయలుదేరిన పని జయప్రదంగా జరగాలి. జరుగుతుందనే నమ్మతోంది లక్ష్మమ్మ.

* * *

రాత్రి ఎనిమిది గంటలప్పుడు తలుపు తట్టాడు పరంధామయ్య. ఎవరూ అంటూ తలుపు తీశాడు సుందర్రావు. సుందర్రావు రఘురామయ్యగారి పెద్ద కొడుకు. అతని తమ్ముడే వరుడు. పరంధామయ్యకి కాబోయే లేక అయివుండే అల్లుడు. రేణుకకీ, సుందర్రావుకి పెళ్ళయి ఏడాదయింది.

'మీరా! రండి' అన్నాడు సుందర్రావు ఆశ్చర్యంగా.

పరంధామయ్య లోపలికి అడుగు పెడుతూనే నాన్నగారున్నారా? అన్నాడు.

లేరండి ఇవాళే ఊరెళ్ళారు. రేపు రావచ్చు. అన్నాడు సుందర్రావు.

రేణుక కాళ్ళకి నీళ్ళిచ్చింది. అంతా బాగున్నారా అని అడిగింది. నిజానికి పరంధామయ్య తరపు వాళ్ళెవరో, సుందర్రావుకిగానీ, రేణుకకిగానీ, తెలియదు. ఈయన్ని కూడ ఒకసారి మాత్రమే చూశారు. ఆయన అతిథిగా వస్తారని కూడ అనుకోలేదు. పరంధామయ్యకీ, వాళ్ళు రఘురామయ్య కొడుకూ కోడలుగానే తెలుసు. అంతకుమించి ఏమీ తెలియదు.

తనని చూసినప్పుడు సుందర్రావు ఆశ్చర్యపోవడం గమనించాడు. పరంధామయ్య. అవును మరి, తను వాళ్ళకి అతిథిగా వస్తాడని తను అనుకోలేదు. వాళ్ళూ ఊహించలేదు.

ఎందుకు వచ్చినదీ, ఎన్నాళ్ళుండేదీ అడుగలేదు వాళ్ళు. పరంధామయ్య కూడ కల్పించుకుని చెప్ప లేదు. రేణుక సుందర్రావులతోపాటు సుందరరావు నాయనమ్మ కూడ వుంటోంది. ముసలిది. చూపు ఆనదు. మాట సరిగా వినబడదు.

రేణుక మంచి నీళ్ళిచ్చింది. తాగి, ఇప్పుడేవస్తాను అంటూ బయలు దేరాడు.

'వంటయిపోయింది. భోజనం చేసి వెళ్ళచ్చు' అంది రేణుక.

'లేదమ్మా! భోజనం చేసే వచ్చాను అని చెప్పులు వేసుకొని బయలుదేరాడు. పనుండికాదు. కాసేపు బయట తిరగాలని.'

ఇంట్లో రేణుక సుందరరావు ఇద్దరే వున్నారు. తను రావడం వాళ్ళకి యిబ్బంది. వాళ్ళకి యిబ్బందిగా వుండటం తనకీ యిబ్బందిగానే వుంటుంది. కాని తప్పదు రేపు పదకొండింటిదాకా. రేపు పోస్ట్మన్‌కి ఎదురు వెళ్ళాలి. తొమ్మిదింటి నుంచి వీధిలోనే వుండాలి. ఈవీధి పోస్ట్మన్ కనిపించగానే ఈయింటి గుర్తు చెప్పి ఉత్తరాలు వచ్చాయేమో అడగాలి. అప్పుడు సుందర్రావు యింట్లో వుండకూడదు. రేణుక గుమ్మంలో వుండకూడదు. సుందరరావు ఎలాగూ వుండడు. ఆఫీసుకి వెళ్ళిపోతాడు. రేణుక గుమ్మంలో వుండకుండా చూసుకోవాలి. ఉంటే లోపలికి పంపించెయ్యాలి.

బాగా ఆకలివేస్తోంది. ఇంట్లో ఎందుకో అన్నం తినాలనిపించలేదు నాలుగడుగులు వేస్తే విజయ విహార్ వస్తుంది.

విజయవిహార్‌లో కాఫీ తీసుకొని కాన్వెంట్, డి. యి. వో. ఆఫీసుమీదుగా రివర్ బ్రిడ్జి దగ్గరకు వచ్చాడు. బ్రిడ్జి అటూ యిటూ అయిపోయినట్టే, మధ్య పోర్షన్ కడుతున్నారు. త్వరలోనే పూర్తయి పోతుంది. అక్కడనుంచి వచ్చేశాడు యింటికి తొమ్మిదిన్నరయింది.

రేణుక పక్కవేసింది. పడుకున్నాడే గాని ఎంతకీ నిద్రపట్టలేదు. అదోలా వుంది. మనసులో ఆందోళన.

పదిపదకొండు ప్రాంతంలో దుప్పటి యివ్వటానికి వచ్చాడు సుందరరావు. అప్పటికి మగతగా నిద్రపడుతోంది.

'రేపు ప్రొద్దున్న పిక్నిక్‌కి వెళుతున్నాము. మీరు కూడ వస్తారా?' అన్నాడు సుందరరావు.

'ఎక్కడికి ?'

'ఇక్కడికి నాలుగు మైళ్ళలో వుంది తోట. అక్కడికి వెళుతున్నాం. సాయంత్రానికల్లా వచ్చేస్తాం.'

'నేనెందుకోయ్.'

'మీరు తప్పకుండా రావాలి. పక్కింటి జానకి రామయ్యగారు కూడ వస్తున్నారు. మీకు కాలక్షేపం కూడ అవుతుంది.'

'చూద్దాంలే,' అన్నాడు ఆవలిస్తూ, సుందర్రావు వెళ్ళిపోయాడు.

[illegible] మాటలు వినిపించాయి.

అతిథి

ఆయన ఏమన్నారు? అంటోంది రేణుక.

ఏదీ సరిగ్గా చెప్పలేదు.

అసలెందుకు వచ్చారుట. . . . . అని ఆ— ఆయన నిద్రపోయారా? అంది.

'పోయేవుంటారు. ఇందాకనే ఆవలిస్తున్నారు.'

'తమ్మని గట్టిగా అడగలేకపోయారా?'

'ఎందుకు లెద్దూ. యిందాక సినిమాకి వెళదామను కున్న వాళ్ళం మానేశాం యీయన్ని పిలవాలో పిలవ కూడదో తెలియక. యీయనకి యిబ్బంది ఉవుతుం దని. నువ్వు ఎన్నియినా చెప్పు. ఈ అతిథులతో ప్రతి దానికీ యిబ్బందే.'

'ఛ. తప్పు. అలా అనకూడదు. పిలవండి ఆయన్ని రేపు పిక్నిక్‌కి వెళదామనుకున్నప్పుడు, ఆయన వుంటేయేం? అంది.'

మాటలు వినాలని లేదుగాని వినపడుతున్నాయి. తన వునికి వాళ్ళకి అంత యిబ్బందిగా వుంటుందని తెలిసీకూడ వాళ్ళకి బలవంతపు అతిథిగా వుండవలసి వస్తోంది. అయినా తప్పదు తనకి.

తెల్లారి ఆయిదింటికి లేచారు. జానకిరామయ్య గారు లేపడానికి వచ్చేసరికే పరంధామయ్య మేలుకొని వున్నాడు. నిద్రపట్టలేదు. తప్పించుకుందామని ప్రయత్నం చేశాడు. కాని జానకిరామయ్యగారు వదిలిపెట్టలేదు అప్పుడు తనతో పరిచయం చేసు కున్న మనిషి తనని చనువులో బలవంత పెట్ట టం ఆశ్చర్యం వేసింది పరంధామయ్యకి. కొందరు మనుష్యులంతే.

లేదండీ పనులున్నాయి అని తప్పించుకోబో యాడు జానకిరామయ్యగారు వదలదలచుకోలేదు. దగులుంటే సాయంత్రం చూసుకోవచ్చు తొం దరగా నాలుగింటికే వచ్చేద్దాం అన్నాడు. తప్పనిసరి అయింది పరంధామయ్యకి అదీగాక పుత్తరంవచ్చినా యింట్లో ముసలామె తప్ప ఎవ్వరూ వుండరు. ఆమెకి చదవడం రాదు. చూపు ఆనదు. ఐను సాయం త్రం ముందుగా వస్తే సరిపోతుంది.

ఇంటిదగ్గర సుందరరావు నాయనమ్మను వదిలి రేణుక, సుందరరావు, పరంధామయ్య, జానకి రామయ్యగారు ఆయన కొడుకు, కోడలు, ఇద్దరు చిన్న పిల్లలు బయలు దేరారు.

జానకిరామయ్యగారితో వున్నాడన్న మాటేగాని మనసంతా యింటిమీదే వుంది. ఆయన ఏం చెబు తున్నదీ వినిపించడంలేదు. పదకొండింటికి రెండోసారి కాఫీ తాగుతున్నప్పుడు 'ఈ టైముకి ఉత్తరం వచ్చి వుంటుంది' అనుకున్నాడు ఒంటిగంటకు భోజనాలు చేశారు. ముసలామె ఉత్తరం తీసుకొని వుంటుం దేమో అనుకున్నాడు, అసలు యీవేళ వస్తుందా? పోస్టులో మిస్ అవుతుందా? లేకపోతే ఒకటి రెండు రోజులు ఆలస్యంగా వస్తుందా? అప్పుడు తనపని యింకా కష్టం అవుతుంది ఇవాళ వచ్చేస్తే ఒక రకంగా నయం. లేకపోతే తను యిక్కడ ఎన్నాళ్ళుం డాలో తెలియదు.

మీకు చదరంగం వచ్చా అన్నాడు ఆయన తన బాధనీ పరంధామయ్య వినడంలేదని తెలిసి.

వచ్చు అన్నాడు పరంధామయ్య.

ఆయన దగ్గర చదరంగం బోర్డు వుంది. బల్ల పరిచి పావులు సర్ది ఆడటం మొదలుపెట్టారు. ఆయన వోపెనింగ్ పాన్ క్వీన్ ఫోర్. తనది కింగ్ ఫోర్. తనకి క్వీన్ ఫోర్ ఆడటం అంత బాగా తెలియదు. అదీగాక మనసు ఆటమీద లేదు. వరుసగా మూడు ఆటలు వోడిపోయాడు. నాలుగో ఆట వోడిపోయే పరిస్థితి వుంది.

మీకు ఆట బాగావచ్చు. కాని సరిగ్గా ఆడటం లేదు అన్నాడు ఆయన.

అప్పుడు చూశాడు ఆట పరిస్థితి. ప్రమాదం లోంచి తేరుకునేందుకు చాలాకష్టపడవలసివచ్చింది.

ఆట ఆయేసరికి నాలుగయింది. పరంధామయ్య వులిక్కిపడి లేచాడు. రేణుక, సుందర్రావు కంటే తను ముందు వుండాలి. గబగబా రేణుక దగ్గరకి వెళ్లి నేను వస్తానమ్మా అన్నాడు.

ఉండండి మేమూ వస్తున్నాం అంది రేణుక.

జానకిరామయ్యగారు పోనియ్యలేదు. అందరు కలిసి వెళదాం అన్నారు. అదీకాక, తను ముందు వెళ్ళ డానికి వాహనం ఏదీ లేదు. అందరితోట బయలుదేరి తీరాలి. లేకపోతే, నాలుగు మైళ్ళు నడవాలి. నడిచి వాళ్ళకంటే ముందు వెళ్లటం జరిగేపని కాదు. ఈ విష యం తను ముందే ఆలోచించలేదు.

అందరు కలిసే బయలుదేరారు. పరంధామయ్య ఒంట్లో రక్తం పరుగులు పెడుతోంది. ఒక్క అర గంటలో ఇల్లు చేరుకుంటారు. ఉత్తరం వచ్చి ఉంటుందా? వస్తే ఏం చెయ్యాలి?

ఇంటిదగ్గర సుందరరావు నాయనమ్మ తలుపు తీసింది

'ఉత్తరాలేమైనా వచ్చాయా' అన్నాడు సుందర రావు.

వచ్చింది అంది ముసలావిడ.

పరంధామయ్య ఊపిరి బిగపట్టాడు. గుండె గట్టిగా పట్టుకున్నాడు.

ఏదీ అన్నాడు సుందర్రావు.

అదిగో డ్రాయర్లో పెట్టాను అంది దక్షి ణంవైపు చూపిస్తూ.

రేణుక ఆ గదివైపు కదలింది. ఒక్కక్షణం ఆగి పోయిన పరంధామయ్య తేరుకుని గబగబా ఆ గది వైపు అంగలు వేశాడు.

'రండి, నిలబడ్డారేం?' అంది రేణుక వింతగా చూస్తూ.

'నీళ్ళు పోసుకోవాలి. తోపులావేస్తానని. . . .'

తోడుతాను. . . . . . ఉత్తరం ఇచ్చేసి. .

ఉత్తరం తియ్యడానికివెళ్ళతూంది. ఎలా ఆపాలి?

'ఉత్తరం నేను చూస్తానులేమ్మా! నీళ్ళ తోడూ' . . . . . . అనబోయేంతలోనే రేణుక డ్రాయరు తెరిచింది.

పరంధామయ్య తలుపుకి ఆనుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు.

డ్రాయరు తెరచి కాయితాలు తియ్యడం. . . .

అతిథి

క్కనే పెట్టడం మళ్ళీ వ్రాయిరా మయ్యాతం. ... ళ్ళీ తెరవడం. . . . . . వినబడ్డాయి.

'ఏదండీ. కనపడదేం?' అంది రేణుక.

జరిగినది నిజమేనా? రేణుకకి వుత్తరం కనబడ లేదా?

పరంధామయ్య నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు. రేణుక డ్రాయరులోని కాయితాలు అన్నీ వెదికి చూస్తోంది. ఉత్తరం కనబడలేదు.

సుందరరావు కూడా అక్కడికి వచ్చాడు. తనూ వెదికాడు. కనబడలేదు 'ముసలావిడకు మతిమరుపు అసలిక్కడ పెట్టిందో లేదో' అన్నాడు విసుగ్గా.

పరంధామయ్య దీర్ఘంగా నిట్టూర్పు వదిలాడు. అరంగుళందూరంలో ఉన్న ప్రమాదం కొంచెం దూరమయింది. కొంత తెరిపివచ్చింది. కానీ ఈ అదృష్టం ఎంతసేపు నిలుస్తుంది?

బామ్మా! అని పిలిచాడు సుందరరావు.

ఏమిరా అని కేకవినబడింది.

'ఉత్తరం ఎక్కడ పెట్టావు. కనబడటం లేదే.'

'అక్కడే పెట్టానే ఉండువస్తున్నా' అని కేక వినిపించింది.

పరంధామయ్య గుమ్మంలోంచి పక్కకి తప్పు కున్నాడు. అక్కడ వుండలేక పోయాడు. ఉత్తరం అక్కడ పెట్టిన మనిషి వస్తోంది. ఆమెకి కూడ వుత్తరం కనిపించదనుకోవడం కేవలం భ్రమ. అదృష్టాన్ని మరీ అంత ఎక్కువగా నమ్మకోకూడదు. వెళ్ళి దూరంగా మంచం మీద కూర్చున్నాడు. తను చెయ్యగలిగింది ఏమీలేదు.

ముసలావె పొవుగంట వెదికింది. కనబడలేదు.

'నీ కెప్పుడూ మతిమరుపే. ఏదీ గుర్తుండదు గుర్తు తెచ్చుకో ఎక్కడ పెట్టావో', అంటున్నాడు సుందరరావు విసుగ్గా.

గుర్తు తెచ్చుకోవద్దు అనుకున్నాడు పరంధామయ్య. వయసు మీద పడితే మతిమరుపు రావడం కూడ యిందుకు మంచిది.

అదెంత ముఖ్యమైన ఉత్తరమో! అంటోంది రేణుక.

ముఖ్యమైన ఉత్తరమేకాని చూసేదికాదు అనుకున్నాడు. పరంధామయ్య.

ఆయన ఆ సాయంత్రం బయటకు కదలలేదు. రేణుక సుందర్రావులతోపాటే వున్నాడు. వాళ్ళకి ఆ ఉత్తరం సంగతి ఎప్పుడు తెలిస్తే తనకీ ఆ క్షణం లోనే తెలియాలి. వాళ్ళతోనే ఉన్నాడు. వాళ్ళకి యిబ్బంది అని దృష్టికి రాలేదు. ఉత్తరం, ఉత్తరం అదే ధ్యాస.

ముసలమ్మ చాలసేపు గొణుక్కుంది. మాయ దారి మరుపు, అనుకొంది.

రాత్రి తొందరగానే పక్కమీదికి చేరాడు పరంధామయ్య. చాల అలసటగా వుంది. నిద్రవస్తోంది. కాని, నిద్రపోవడానికి వీలులేదు.

ఇవాళ రఘురామయ్యగారు రాకపోవడం ఒకవిధంగా మంచిదే. వస్తే తను ఏపని మీద వచ్చినదీ ఆయనకి చెప్పాలి. ఈవూళ్ళో చాల పరపతి వున్నవాడు ఆయన. ఫలానా ఆఫీసులో పని అన్నా, కోర్టు వ్యవహారం అని చెప్పినా 'నేను ఎవరినైనా పంపి చేయిస్తాలెండి. ఏం పని?' అంటారు. ఏం పని అని చెబుతాడతను?

'ఏమిటండీ ఆయన అలా యింట్లో ఎక్కడ పడితే అక్కడకి వచ్చేస్తాడు?' అంటోంది రేణుక. ఆమెకి పరంధామయ్య మీదనున్న గౌరవం తగ్గింది. గదిలోవుంటే గదిలోకి, హాలులో వుంటే హాలులోకి వస్తూ ఎక్కడ వుంటే అక్కడ వుంటున్నాడు.'

'కొందరు పెద్దవాళ్ళు అంతే! చాదస్తం. అంతా ప్రేమలా కనిపిస్తుంది వాళ్ళకి. అసలు అతిథులు వస్తేనే యిబ్బంది. అందులో యిలాంటి వాళ్ళు మరీను!' అంటున్నాడు సుందరరావు.

విని వూరుకున్నాడు పరంధామయ్య. తనకి వినబడుతోందని వాళ్ళు అనుకొని వుండరు.

'సరే, ఇవాళ ఆయన మంచం పక్కనే మీ మంచం వేస్తాను. రాత్రి మంచినీళ్ళు కావాలన్నా, ఇంకేం కావాలన్నా చూడండి' అంది.

'నాకు నిద్రబాగా వస్తోంది. మెలకువరాదు.'

'బాబ్బాబు. ఈ ఒక్కరోజుకే. . . . .' అంది రేణుక లాలనగా. సరేనన్నాడు సుందర్రావు.

పడుకోబోయేముందు 'బామ్మా, వుత్తరం ఎక్కడపెట్టావో గుర్తుకు వచ్చిందా' అన్నాడు.

'లేదురా?' అంది. ఇందాకటలా తిట్టకపోయే సరికి ఆమెకి కొంచెం మనసు కుదుటపడింది. స్థిమితంగా ఆలోచించింది.

'గుర్తువచ్చిందిరా అబ్బాయ్' అంది పది నిమిషాల తర్వాత.

ఆతను లేవలేదు. మెలకువ రాలేదు. కాని మళ్ళీ పిలుస్తుందేమో. ఈ మాటు లేస్తాడేమో.

'అబ్బాయి నిద్రపోయాడు. మెల్లగా మాట్లాడండి. అన్నాడు పరంధామయ్య. ఆమె దగ్గరకి వెళ్ళి.

'ఎవరూ?' అంది ముసలామె గట్టిగా చూపు ఆనక, మాట వినబడక.

'నేనేలెండి పరంధామయ్యని. ఉత్తరం ఎక్కడ పెట్టారు?' అన్నాడు. నవనాడులు బిగుసుకున్నాయి.

'డ్రాయర్లో పెట్టాననుకున్నాను. లేదు. అలమారులో పెట్టాను' అంది ముసలామె పెద్దగా.

ఏమిటే గోల అంటూ లేచాడు సుందరరావు.

'ఏంలేదు. ఒంట్లో బాగున్నట్లు లేదు. నువ్వు పడుకో' అన్నాడు పరంధామయ్య కంగారుగా సర్దేస్తూ.

'మీరు లేచారేం? ఏమైనా కావాలా?' అన్నాడు సుందర్రావు నిద్ర మత్తులోనే.

'లేదు. నిద్ర పట్టక.'

'వినరమంటారా,'

'వద్దు నిద్ర పడుతుంది. నువ్వు పడుకో' సుందర్రావు పడుకోలేదు. రేణుక మరీ మరీ చెప్పింది ఆయనకి కావలసినవన్నీ చూడమని.

'లేదు లెండి. నిద్ర రావడంలేదు' అన్నాడు. తప్పలేదు. పరంధామయ్య వెళ్ళి మంచం మీద పడుకున్నాడు. సుందరరావు పడుకునే దాకా తను పడుకోక తప్పదు.

ఇంట్లో అలమారలో వుంది. ఇల్లు తాళం వేసి వుంది. తాళం అతని తలగడ క్రింద వుంది. తాళం తీసుకోవాలంటే ఏదో కారణం చెప్పాలి.

'తాళం వుందా? అన్నాడు.'

'ఏం కావాలి?'

'మాత్ర వేసుకోవాలి.'

సుందరరావు తాళం తీసుకుని లేచాడు 'ఇస్తాండుండి నేను తీసుకుంటా' అన్నాడు పర



ధామయ్య. మంచి నీళ్ళివ్వాలిగా అంటూ తాళం తీసి వంటింట్లోంచి మంచినీళ్లు తెచ్చి యిచ్చాడు సుందర్రావు.

జేబులోంచి సారిడాన్ మాత్ర తీసి వేసుకొన్నాడు. తలనొప్పి వస్తోందని దగ్గర పెట్టుకున్నాడు అని ఇంక అక్కడ వుండటానికి అవకాశం లేకపోయింది.

మళ్లీ వచ్చి పడుకున్నాడు. క్రితం రాత్రి నిద్ర లేకపోవడం వల్ల నిద్ర బాగా వస్తోంది. కాని నిద్ర పోకూడదు.

అరగంట తర్వాత లేచాడు. ఈమాటు సుందరరావు లేవలేదు. నెమ్మదిగా తాళాలు తీసుకున్నాడు, అతని తలగడ క్రింద నుంచి. తాళం తీసుకొని లోపలికి వెళ్లాడు. అలమార తలుపు తీసి వెతికాడు.

తను రాసిన కవరు చాల సులభంగా గుర్తు పట్టగలిగాడు. అది తీసుకుంటున్నప్పుడు చేతులు వణికాయి.

తాళం వేసి అది సుందరరావు తలగడ క్రింద. పెడుతోంటే సుందరరావు లేచాడు.

'ఏమన్నా కావాలా?'

'ఏంలేదు. కడుపునొప్పిగా వుంటేనూ...'

'సోడా తెమ్మంటారా..'

'వద్దు. తగ్గిపోయిందిలే' అన్నాడు.

రెండు రాత్రులు నిద్ర లేదేమో వళ్లు మరచి నిద్రపోయాడు.

మర్నాడు ఎనిమిదింటికి నిద్ర లేచాడు. మనసు ప్రశాంతంగా వుంది. ఆదుర్దా, ఆందోళనా, టెన్షన్ యివేమీ లేవు యిప్పుడు.

ముసలావిడ కవరు కోసం వెతకడం, సుందరరావు ఆవిడ మీద విసుక్కోవడం గమనించాడు...

'పోనీ లేవోయ్. ముసలావిడ కదా మరచిపోయి వుంటుంది!' అన్నాడు.

సుందరరావు ఆతర్వాత ఆమె నేమీ అనలేదు. కాసేపాగి నేను పదకొండు గంటల బండికి వెళ్లిపోతున్నాను అన్నాడు.

'అదేమిటి నాన్నగారు వచ్చేదాకా వుండరా?'

'వచ్చేటట్టు లేరు.'

'లేదు. ఆయన స్నేహితుడితో బెజవాడ వెళ్లారు. ఇవాళ వస్తారు, పోనీ ఆయనతో ఏమైనా చెప్పాలా?'

'చెప్పేది ఏమీలేదు.'

బయలుదేరుతూంటే వచ్చారు రఘురామయ్య గారు. వస్తూనే 'ఎప్పుడు వచ్చారు' అన్నాడాయన కంగారుగా.

'మొన్నరాత్రి.'

కొంచెం స్థిమిత పడ్డాడాయన. మొహంలో ఆనందం కనిపించింది.

'ఉంటారా రెండు రోజులు?'

'లేదు. పదకొండు గంటల బండికి వెళ్లిపోతున్నాను.'

'అయితే నేనూ వస్తాలెండి. పనుంది మీతో' అన్నాడాయన.

లోలోపలే విసుక్కున్నాడు పరంధామయ్య. ఈయనకి యిప్పుడే పని తగలాలా? తను యింటికి వెళ్లగానే తిరుపతి ప్రయాణం పూరడి. భార్య అన్నీ సర్ది ప్రయాణానికి సిద్ధంగా వుంటుంది. ఈయన వస్తే మరో రెండు రోజులైనా వుంటాడు. ప్రయాణం వాయిదా పడుతుంది. తనకే యిబ్బంది.

పరంధామయ్యతో బాటే బయలుదేరాడు ఆయన. ప్రయాణం అంతా ఆయన యేదో కల్పించుకుని మాట్లాడుతోనే వున్నాడు. అంత చనువుగా, అంత కలుపుగోలుగా ఆయన మాట్లాడటం కొత్తగానే వుంది పరంధామయ్యకి. పిల్లలు, సంబంధాలు, పెళ్లిళ్ళు, పీటల మీద పెళ్లిళ్లు చెడిపోవటం ఇవన్నీ మాట్లాడాడు. కుదిరిన పెళ్లి ఏ సందర్భములోను మానుకోకూడదు, అన్నాడు అసందర్భంలోనే. అప్పుడే కొంచెం అనుమానం వచ్చింది పరంధామయ్యకి తన సంగతి తెలిసిందేమోనని. కాని, తెలిసి వుండటానికి వీల్లేదు.

మాట పట్టింపుల కోసం పెళ్లిళ్లు చెడిపోయిన సందర్భాలు చాల చెప్పాడు ఆయన. స్నేహాలు బంధుత్వాలు కలసిన తర్వాత చిన్నచిన్న విషయాలు వాళ్ల మధ్య స్పర్థలు తేకూడదు. పొరబాటున ఎవరైనా మాట జారినా రెండో వాళ్లు పట్టించుకోకూడదు అన్నాడు. సందర్భం కల్పించుకుని చెప్పినట్లుగా వుంది. తను వుత్తరం రాసిన సంగతి తెలిసిందా? అది తను చూసివున్నా ఏమీ అనుకొని వుండేవాడిని కాను అని చెబుతున్నాడా? ఏమీ అర్థం కాలేదు. అర్థం మాట అటుంచి అసలు విసుగ్గా, చిరాగ్గా వుంది. ఈ తప్పనిసరి అతిథితో.

ఇంటికి వెళ్లిన తర్వాత కూడ తనతో పాటే వున్నాడాయన. తన భార్యతో కూడ రెండు నిమిషాలు మాట్లాడుకోవడానికి అవకాశం రాలేదు.

భోజనాలయిన తర్వాత ఆయన నిద్ర పోలేదు. ఊళ్లో పని వుందన్న మనిషి, ఆ పని చూసుకోవడానికి వెళ్లలేదు.

మధ్యాహ్నం లక్ష్మమ్మ అన్నట్లు మర్చేపోయాను. మీకో వుత్తరం వచ్చింది అంది.

ఎక్కడ నుంచి?

ఏమో నేను చూడలేదు. కవరొచ్చింది. లక్ష్మమ్మ కవరు ఇస్తోంటే పరంధామయ్యతో పాటు రఘురామయ్య కూడ లేచి కూర్చున్నాడు.

ఉత్తరం రఘురామయ్య దగ్గర నుంచి: పరంధామయ్య ఆయన కేసి చూశాడు. మొహంలో ఆదుర్దా, ఆందోళనా, కంగారు.

చటుక్కున స్ఫురించింది అదేనా కారణం? అందుకే అయి వుంటుందా ఇదంతా?

లక్ష్మమ్మని మంచినీళ్ళ కని ఇంట్లోకి పంపాడు.

'మీకు జోగయ్య తెలుసా?' అన్నాడు నవ్వి. రఘురామయ్య ఆశ్చర్యంగా చూసి, తెలుసునన్నట్లుగా తల ఊపాడు.

'మిమ్మల్ని ఈమధ్య కలుసుకున్నాడా?'

రఘురామయ్య తల దించుకొని తల ఊపాడు.

'ఫరవాలేదు లెండి. పొరబాట్లు ఎవరికయినా వస్తాయి' అంటూ లక్ష్మమ్మ యిచ్చిన కవరుని చదవకుండానే ఇచ్చేశాడు పరంధామయ్య.

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాత ప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరింపబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగు మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీలయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

కార్టూన్‌లు

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్‌లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము కాని, వాటి విషయమంలో ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్‌లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్ర వారపత్రిక